క్లుప్తంగా

గుండెపోటుతో కేరళ సిస్టర్ ఎల్సీ మృతి

దెందులూరు: దెందులూరు ఆర్‌సీఎం యూపీ పాఠశాలలో టీచర్‌గా పనిచేసిన కేరళ రాష్ట్రానికి చెందిన సిస్టర్ ఎల్సీ (76)శనివారం గుండెపోటుతో పెదవేగి మండలం ప్రకాష్‌నగర్‌లోని సిస్టర్స్ హోంలో మృతి చెందారు. 25 ఏళ్లుగా ఆంధ్రా ప్రాంతానికి వచ్చి పలు మిషనరీ సంస్థల్లో ఉపాధ్యాయురాలుగా, ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సేవకురాలుగా, ఆధ్యాత్మిక అభివృద్ధికి విశేష సేవలందించారు. ఆమె మృతిపట్ల ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు, ప్రొవిన్షియల్ సుపీరియర్ లీజా స్టెబస్టియన్, అసిస్టెంట్ ప్రొవిన్షియల్ మరీథెరిజ్, వికార్ జనరల్ ఫాదర్ డాక్టర్ బాల, సెయింట్ జాన్స్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ జీ. మోజెస్, దెందులూరు ఆర్‌సీఎం యూపీ స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ టీనామరియా, దెందులూరు ఫాదర్ జీ. అమ్మన్‌రాజా సంతాపం తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆమె సేవలను కొనియాడారు.

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలి

దెందులూరు: ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న వైద్యసేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సోమవరప్పాడు సర్పంచ్ సరిగే నాగరాజు అన్నారు. ఆదివారం సోమవరప్పాడులో భావనాంజలి ప్రథమ చికిత్సా ప్రాంగణంలో ఏలూరు శ్రీ కృష్ణ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 116 మందికి రక్త, ఎముకలు, సాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.కృష్ణ, డాక్టర్ వరప్రసాద్, పట్నాయక్, ఆనంద్ వైద్య సేవలందించారు. ఆసుపత్రి మేనేజర్ నాగేశ్వరరావు తదితరులున్నారు.

పళ్లెం ప్రసాద్‌ను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

దెందులూరు: అనారోగ్యంతో వైద్యసేవలు పొందుతున్న ఫారెస్ట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పళ్లెం ప్రసాద్‌ను ఆదివారం ఆయన నివాసంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, రాణి, జెడ్పీ చైర‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్ పరామర్శించారు. ఆయన ఆరోగ్యవైద్యసేవలు గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, సర్పంచులు ప్రభుదేవ, రఘు, అచ్యుత్ గౌడ్ ఉన్నారు.

క్రికెట్ పోటీల విజేత బ్లూ జట్టు



క్రికెట్ పోటీల విజేత జట్టుకు షీల్డు, నగదు బహుమతి అందజేస్తున్న పుప్పాల కార్తీక్

ఉంగుటూరు: క్రికెట్ పోటీలు యువతకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని పుప్పాల కార్తీక్ అన్నారు. ఆదివారం నారాయణపురంలో ముగిసిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ఆయన పంపిణీ చేశారు. విజేతగా నిలిచిన బ్లూ టీముకు షీల్డుతోపాటు రూ.20 వేల నగదు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన కిల్లర్స్ జట్టుకు షీల్డుతోపాటు రూ.15 వేల నగదు అందజేశారు. ఈ పోటీలను పుప్పాల కార్తీక్ పర్యవేక్షణలో బంకు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు, హరివిల్లి మహాలక్ష్మి, దానయ్య, వార్డు సభ్యుడు నేదూరి గంగాధర్‌రావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, మతుకుమిల్లి శ్రీధర్, పైడి వరప్రసాదు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మెదటి బహుమతి నగదును ఐస్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు పాత్తూరి శ్రీనివాసరాజు స్పాన్సర్ చేశారు. రెండో బహుమతి షీల్డ్, నగదును ఆర్గనైజర్లు అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో నిర్వాహకులతోపాటు పుప్పాల కార్తీక్, పాత్తూరి శ్రీనివాసరాజు, ఉప సర్పంచి అడపాశ్రీను, సీపాని బాలు పాల్గొన్నారు.

నేడు పెదవేగిలో 'స్పందన'

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం పెదవేగిలో స్పందన యథావిధిగా నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్ నాగరాజు చెప్పారు. నెలరోజులుగా జగనన్న సురక్ష కార్యక్రమం విస్తృతంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యలు వినతుల రూపంలో సమర్పించి సత్వరం న్యాయం పొందాలని కోరారు. మండల అధికారులందరూ కార్యక్రమంలో పాల్గొంటారని తహసీల్దార్ తెలిపారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం : కోడిపందేలపై ఆదివారం జంగారెడ్డిగూడెం పోలీసులు దాడులు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు.

ముంపుబారిన పడిన పొలాల పరిశీలన

దెందులూరు: మండలంలో ఆదివారం సాయంత్రం వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ ముంపుబారిన పడిన వరి పొలాలను పరిశీలించారు. ఉండ్రాజవరం, పోతునూరు, కొవ్వలి గ్రామాల్లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నష్టపోయిన పొలాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెర్టిలైజర్ బూస్టర్ డోసు, యూ రియా 20 కేజీలు, ఎంటపీ 20 కేజీలు, ఎకరానికి పిచికారీ చేయాలని రైతులకు అసిస్టెంట్ డైరెక్టర్ సూచించారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ల సూచనలు, సలహాలు పొంది సాగులో ప్రభుత్వ సాయం పొందాలన్నారు. దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లో మునిగి పొలాల్లో నీరు దాదాపుగా తొలిగిపోతుందన్నారు. 225 ఎకరాలు ముంపునకు గురైందని వీటిలో కొంతమేర మాత్రమే పాక్షికంగా నష్టవాటిల్లిందని అసిస్టెంట్ డైరెక్టర్‌కు వివరించారు. వారి వెంట కొవ్వలి, ఉండ్రాజవరం, పోతునూరు వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ఉన్నారు.



మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏలూరు ఏడీఏ సుబ్బారావు



కొవ్వలిలో వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కే. సుబ్బారావు

ఉన్నతాధికారుల దృష్టికి డ్రెయినేజీల సమస్య

పెదపాడు: డ్రెయినేజీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఏలూరు ఏడీఏ వై సుబ్బారావు తెలిపారు. పెదపాడు మండలంలోని ఖాజీగూడెం, సకలకొత్తపల్లి, సత్యవోలు వీరభద్రపురంలో ఆదివారం పర్యటించారు. ఈకార్యక్రమంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ముంపు బారి నుంచి బయటపడిన పొలాల్లో బూస్టర్ డోస్‌గా యూరియా 20 కేజీలు, పొటాష్ 15 కేజీలు చొప్పున వేసుకోవాలని సూచించారు. దీంతో పాటు 19.19.19 ఎకరానికి 1కేజీ చొప్పున చల్లుకోవాలని తెలిపారు. డ్రెయినేజీల సమస్యలపై జిల్లా కలెక్టరు, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఆయన వెంట పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

ఆపద సమయంలో అండగా వలంటీర్ల సేవలు



డయాలసిస్ బాధితుడు జొన్నకూటి వెంకటరత్నంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పూర్ణగంటి అంజలి కావేరి

దెందులూరు: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వలంటీర్లు అందిస్తున్న సేవలు ఆపద సమయంలో భరోసానిస్తోంది. ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పేదలకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 5 విభాగాల పెన్షన్లతో పాటు మరో మూడు విభాగాల్లో పెన్షన్ నగదును అందిస్తోంది. లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ వారి వద్దకు సొంత ఖర్చులతో వలంటీర్లు వెళ్లి ప్రభుత్వ సాయం అందిస్తున్నారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వెంకటరత్నం కొంత కాలంగా డయాలసిస్ సమస్యతో బాధపడుతున్నాడు. గ్రామంలోని వలంటీర్ పూర్ణగంటి అంజలికావేరి అతని ఇంటికి వెళ్లి వైద్య సేవకు తన వంతు తోడ్పాటు అందించడంతో పాటు బాధితులు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి పెన్షన్ నగదును అందచేస్తోంది. వలంటీర్ల సేవలను లబ్ధిదారులు, గ్రామస్తులు కొనియాడుతున్నారు.

రోగులకు ఎంతో మేలు



దీర్ఘకాలిక రోగాల బాధితులను ప్రభుత్వం పెన్షన్ రూపంలో ఆదుకుంటోంది. బాధితులు ఎక్కడ ఉంటే అక్కడికి వలంటీర్లు వెళ్లి పింఛను నగదు అందించడం అభినందనీయం. వలంటీర్లు సేవాభావంతో పని చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న నాకు ప్రభుత్వం అందించే సాయం ఎంతో ఉపయోగపడుతోంది.

– జొన్నకూటి వెంకటరత్నం, పెన్షనర్, అక్కిరెడ్డిగూడెం

మానవతకు ఫ్రీజర్ బహూకరణ



దాత రామకృష్ణను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

గణపవరం: మానవత స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు తమవంతు సహకారం అందించాలని మానవత సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు సాగిరాజు జానకిరామరాజు అన్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన గణపవరానికి చెందిన సింగులూరి రామకృష్ణ మానవత గణపవరం మండల శాఖకు ఫ్రీజర్ కొనుగోలు నిమిత్తం ఆదివారం రూ.75 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా దాత రామకృష్ణను మానవత సభ్యులు దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక మాట్లాడుతూ తన మిత్రుడు రామకృష్ణ అడిగిన వెంటనే ఫ్రీజర్ కొనుగోలుకు రూ.75వేలు అందించడంపై అభినందనలు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ దాతల సహకారంతో ఒక ఫ్రీజర్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

హైందవ సంస్కృతి పరిరక్షణ లక్ష్యం

దెందులూరు: రాజకీయాలకు అతీతంగా అందరూ ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించాలని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామంజనేయచౌదరి అన్నారు. ఆదివారం కొవ్వలిలో 146 బూత్ కమిటీ సభ్యులతో మొటపర్తి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు తిలకించారు. ప్రధానమంత్రి పిలుపునిచ్చిన పర్యావరణ పరిరక్షణ, తిరుపతి విశ్వవిద్యాలయ పీఠం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

నీటి నాణ్యత పరీక్షలు



నీటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: వాతావరణం మారి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం గణపవరం మండలంలోని గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో మంచినీటి పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా పథకాల ద్వారా ప్రజలకు అందిస్తున్న నీటి నాణ్యతను పరీక్షించారు. నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతే ప్రజలకు సరఫరా చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంచినీటి పరీక్షలు చేసి ట్యాంకు శుభ్రం చేసిన తేదీలను ప్రదర్శించాలని సూచించారు.

సోలార్ లైట్, సూచిక బోర్డు ఏర్పాటు హర్షణీయం



సోలార్ లైట్‌తో సూచిక బోర్డు

భీమడోలు: రాష్ట్రీయ రహదారి భీమడోలులోని కోమటికుంట రోడ్డు వద్ద భీమడోలు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు సూచిక బోర్డు, సోలార్ లైట్లు ఏర్పాటు చేసి తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు జాతీయ రహదారిని నిర్మించడంతో సూర్యగూడెం నుంచి నుంచి భీమడోలు గ్రామానికి వెళ్లే ప్రజలు కోమటికుంట రోడ్డు వద్ద ఎటు వెళ్లాలో అర్థం కాక నానా అవస్థలు పడుతున్నారు. భీమడోలు గ్రామానికి వచ్చే ప్రజలు రాత్రి వేళల్లో మరీ ముఖ్యంగా తికమక పడుతూ గమ్యానికి చేరుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. ఈ రహదారి వెంబడి నిత్యం వందలాది రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సత్యసాయి సేవా సమితి భీమడోలు అధ్యక్షుడు వర్దినేడి సత్యసాయి ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో వెళ్లే ప్రయాణికులు, మరీ ముఖ్యంగా గ్రామ ప్రజలు భీమడోలు చేరుకునేందుకు అనువుగా భీమడోలు కోమటికుంట వద్ద ఆదివారం సోలార్ లైట్లు బిగించిన సూచిక బోర్డును ఏర్పాటు చేయడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా రహదారిని ఆహ్లాదకరంగా ఉంచేందుకు పక్కనే పలు రకాల మొక్కలు వేసి వాటిని పెంచుతున్నారు.

గ్రంథాలయంలో చిన్నారుల పుస్తక పఠనం



భీమడోలు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



పెదవేగిలో పలు రకాల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం ఉల్లాస భరిత వాతావరణంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలుకు తాతయ్య మాట చిన్నారులకు చూపిన బాట అనే నీతి కథను వివరించారు. ప్రతి ఒక్కరూ కథలోని నీతిని అనుసరించాలని చిన్నారులకు గ్రంథపాలకులు తెలిపారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం విశిష్టతను వివరించారు. కథలు, జీవిత చరిత్రలు, దినపత్రికలు చదివారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం వృద్ధి

పెదవేగి : గ్రంథాలయాలతో విజ్ఞాన పెంపొందుతుందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖ గ్రంథాలయంలో ఆదివారం సమీప గ్రామాలకు చెందిన విద్యార్థులతో చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా దేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రముఖుల జీవిత చరిత్రలను విద్యార్థులకు చదివి వినిపించారు. నిత్యం పుస్తక పఠనంతో ప్రయోజనాలు, జ్ఞాపక శక్తిని ఎలా పెంపొందించుకోవాలో విద్యార్థులకు అరుణ్‌కుమార్ వివరించారు.

వట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు



గతంలో పాఠశాల మైదానం దుస్థితి



పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేసిన దృశ్యం

- నాడు- నేడు ఫేజ్- 2లో రూ. 1.48 కోట్లతో మౌలిక వసతులు, భవనాల నిర్మాణం
- ప్రభుత్వ సాయం, దాతల సహకారంతో అభివృద్ధి పనులు

పెదపాడు: వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తోంది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సమకూరుతున్నాయి. నాడు- నేడు ఫేజ్ - 2కు పాఠశాల ఎంపికవడంతో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.62.97లక్షలు మంజూరయ్యాయి. వీటికి అదనంగా మరో రూ.85 లక్షలు మంజూరవడంతో 8 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి తోడు దాతల సహకారంతో ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నారు. నాడు- నేడు పథకంలో రెండో ఫేజ్‌కు ఈ పాఠశాల ఎంపికైంది. దీనిలో భాగంగా పాఠశాలలో మౌలిక వసతులతో పాటు 8 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. త్వరలో ఈ పనులు పూర్తి కానున్నాయి. దీంతో పాఠశాల రూపురేఖలు మారనున్నాయి. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో వట్లూరు విద్యార్థి 590మార్కుల సాధించడంతో వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరు జిల్లాలో అందరినోటా వినిపించడం గమనార్హం.

టీడీపీ పాలనలో వట్లూరు పాఠశాలకు ఒక్క బాత్ రూమ్ మినహా ఏ ఇతర నిర్మాణం చేయలేదు. విద్యాభివృద్ధిపై టీడీపీకి చిత్తశుద్ధి లేదని ఇది తేట తెల్లం చేస్తోంది.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో దాతల సహకారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. ఈ నాలుగేళ్ల కాలంలో ఈ పాఠశాల పరిధిలో రూ.1.48 కోట్ల విలువైన పనులు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గతంలో కళాశాల మైదానం చిన్న పాటి వర్షానికే చెరువులను తలపించేది. విద్యార్థులు నీళ్లలోనే నడుచుకుంటూ వెళ్లేవారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను, అసౌకర్యాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చారు. ఎస్ఆర్‌ఐలు, పూర్వ విద్యార్థులు, దాతల సహకారం తీసుకుని రూ. 17లక్షల వ్యయంతో పాఠశాలలో విద్యార్థులకు భోజనశాలను నిర్మించడంతోపాటు పాఠశాల మైదానాన్ని గ్రావెల్‌తో మెరక చేసి అభివృద్ధి చేసారు.

దాతల సాయంతో అభివృద్ధి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం. దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన మధ్యాహ్నం భోజన శాలను నిర్మించాం. వర్షాలు కురిసినప్పుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేసాం. – ఆళ్ల సతీష్‌చౌదరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోయేషన్ అధ్యక్షుడు

పాఠశాల్లో మౌలిక వసతులు



ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నాం. నా సర్వీసులో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి సౌకర్యాలు చూడలేదు. నాడు- నేడు పథకంలో పాఠశాలలో నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ, మరమ్మతులు, ఫర్నీచర్, స్మార్ట్ టీవీలు కల్పించారు. వట్లూరులో స్థానిక నాయకులు, దాతలు ముందుకు వచ్చి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చేస్తున్న కృషి ఎనలేనిది.

– నబ్బితి నర్సింహమూర్తి, ఎంఈవో, పెదపాడు

నిధుల దుర్వినియోగంపై విచారణ జాప్యం తగదు

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీ వివాదం రోడ్డెక్కింది. ఆదివారం వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు నివాసంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు, నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. దెందులూరు మండల సచివాలయాల కన్వీనర్, పార్టీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు మాట్లాడుతూ దెందులూరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై చేపట్టిన విచారణలో జాప్యం తగదని అన్నారు. దెందులూరు, అలుగులగూడెం, అప్పారావుపాలెం,సత్యనారాయణపురం గ్రామాల్లో వసూలు చేసిన పన్నుల నగదు ట్రెజరీకి జమ చేయకపోవడం, దీనికి సంబంధించిన రికార్డులు లేకపోవడం దారుణమని కట్టా ఏసుబాబు అన్నారు. మూడేళ్ల నుంచి వసూలు చేసిన పన్నుల నగదు ఎవరు కాజేశారని ఆయన ప్రశ్నించారు. రికార్డులు తీసుకువెళ్లి అధికారులు 18 రోజులు కావస్తున్నా నేటికీ నిధుల దుర్వినియోగంపై విచారణ విషయంలో నాన్చివేత ధోరణితో వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజల నగదుకు అధికారులు పరిరక్షకులుగా, బాధ్యులుగా ఉండాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఒక పంచాయతీ, మూడు శివారు ప్రాంతాల్లో వసూలు చేసిన పన్నుల నగదును ఎవరు ట్రెజరీలో జమ చేస్తారని, ఎవరు బాధ్యత వహిస్తారన్నారని ప్రశ్నించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, వార్డు మెంబర్ కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్ముల రవి, మెండేం ప్రకాశరావు మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.

'మానవత' అభివృద్ధికి సభ్యులు సహకరించాలి



గోపినాథపట్నంలో మానవత సమావేశంలో మాట్లాడుతున్న గంజి రవి

ఉంగుటూరు: మానవత సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గంజి రవి కోరారు. ఆదివారం గోపినాథపట్నంలో మానవత సంస్థ మండల శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గంజి రవి మాట్లాడుతూ మానవత సంస్థ మండలం కొనసాగుతున్న కార్యక్రమాలు వివరించారు. మానవత సభ్యులు, ఆనంద నిలయం చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి మాట్లాడుతూ మానవతకు అనుబంధంగా నిర్మితమవుతున్న వృద్ధాశ్రమం నిర్మాణానికి సభ్యులు సహకరించాలని కోరారు. మానవత రీజయన్ చైర్మన్ మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు 500 మంది సభ్యులను మానవత సంస్థలో చేర్పించాలని కోరారు. సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మానవత కార్యదర్శి పిళ్ళారామకృష్ణ, బొమ్మిడి అప్పారావు, శీతాల సత్యనారాయణ, సూర్యనారాయణరాజు, పడాల తాతాజీ, దొంతల విజయ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం..పేదల సొంతింటి కల సాకారం



భీమడోలులోని జగనన్న కాలనీ వద్ద నినాదాలు చేస్తున్న ఉపసర్పంచ్ ఇనపాల సాయి, జగన్ యూత్ సభ్యులు

భీమడోలు: పేదవాడికి సొంతింటి కలను సాకారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై జన సైనికులు, టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని జగన్ యూత్ యువకులు హెచ్చరించారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో చురుగ్గా ఇళ్లు నిర్మిస్తుంటే జన సైనికులు కాలనీల వద్ద రోడ్లు లేవంటూ విమర్శలు చేయడంపై ఆదివారం వైఎస్సార్‌సీపీ జగన్ యూత్ యువకులు తీవ్రంగా ఖండించారు. భీమడోలు ఉపసర్పంచ్ ఇనపాల సాయి ఆధ్వర్యంలో జగన్ యూత్ యువకులు భీమడోలులోని ఓ ఊరుగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీ వద్ద ఇప్పటికే గృహాల్లో నివాసముంటున్నవారిని అక్కడ కల్పించిన సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులంతా సంతృప్తిని వ్యక్తం చేసారు. భారీ వర్షాలు కురిసిన తరుణంలో ఇలాంటి పరిస్థితులు ఏ ప్రభుత్వంలోనైనా ఉంటాయని, జన సైనికులు అర్థం లేని ఆరోపణలు చేయడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. 2004లో సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భీమడోలులో 800 మందికి ఇళ్ల స్థలాలిస్తే 2009లో టీడీపీ ఇల్లు కూడా కట్టించలేకపోయిందని,అప్పుడు టీడీపీకి సంపూర్ణ మద్దతు ఇచ్చిన జనసేన పార్టీకి ఇది కనిపించలేదా అని ఉపసర్పంచ్ సాయి విమర్శించారు. ప్రస్తుతం కాలనీలో 300 గృహాలకు నిధులు మంజూరుకాగా ఇప్పటికే 30 గృహాలకు చెందిన వారంతా చాలా సంతోషంగా సొంతింటిలో నివాసముంటున్నారన్నారు. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారని, ఇంటింటికీ కరెంట్, మంచినీటి కుళాయిలను ఉచితంగా ఇచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జగన్ యూత్ సభ్యులు ఏ.నాగభూషణం, బి.శ్రీరామ్, బి.ప్రదీప్, జే.సాయి, ఎం.మణికంత, పి.మణిరాజ్, ఎస్.చరణ్ పాల్గొన్నారు.